క్లుప్తంగా

బాలాజీ కల్యాణానికి ఆహ్వానం



ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న చైర్మన్ రామకృష్ణ

మామిడికుదురు: ఈ నెల 31వ తేదీ రాత్రి 9.15 గంటలకు జ్యేష్ఠ శుద్ధ ఏకాదశికి జరిగే అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి కల్యాణోత్సవానికి రావాలని కోరుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులకు శుక్రవారం ఆహ్వానాలు అందించారు. రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్, బీసీ సంక్షేమ శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ ధ్యానచంద్ర, ఎస్పీ శ్రీధర్, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావులను ఆహ్వానించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సహాయ కమిషనరు డి.శ్రీరామవరప్రసాదరావు, ట్రస్టుబోర్డు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సివిల్స్ విజేతకు అభినందనలు



లక్ష్మీరమణిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి

మామిడికుదురు: సివిల్స్‌లో సత్తా చాటిన యర్రంశెట్టి ఉమాశ్రీలక్ష్మీరమణిని శుక్రవారం ఈదరాడలో ఆమె స్వగృహంలో కలిసి పలువురు అభినందించారు. మాజీ ఎమ్మెల్యేలు పాముల రాజేశ్వరీదేవి, మానేపల్లి అయ్యాజీ వేమా పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు. సివిల్ సర్వీసు పరీక్షల్లో ఆల్ ఇండియా స్థాయిలో 583 వ ర్యాంకు సాధించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. నగరం ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల కొండలరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

మండల బీజేపీ కార్యకర్తల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అయ్యాజీ వేమా

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో శుక్రవారం మండల బీజేపీ కార్యకర్తల సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షుడు చెంపాటి శివరామ కృష్ణంరాజు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రాష్ట్రంలో ఉన్న వైఎస్సార్ సీపీ, తెలుగుదేశం కుటుంబ పార్టీలను పారదోలే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గొందిలో రాళ్ల కాలువ గేట్లు కొత్తవి ఏర్పాటు చేయాలని, అంతర్వేది శ్మశానానికి స్థలం కేటాయించాలని తీర్మానాలను చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అడబాల సత్యనారాయణ, రాష్ట్ర బీజేపీ కో ఆపరేటివ్ సెల్ డైరెక్టర్ మాలే శ్రీనివాస నగేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి జి.వెంకటేశ్వరరావు, కన్వీనర్ అడబాల రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు సురేష్ పాల్గొన్నారు.

మోదీ పాలనపై ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు

మామిడికుదురు: ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ పాలన చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 30 నుంచి వచ్చే నెల 30వ తేదీ వరకు అన్ని గ్రామాల్లోను కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు సూచించారు. ఆదుర్రులో శుక్రవారం బీజేపీ కార్యకర్తల సమావేశం మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. చిట్టిబాబు, పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ నేతలు కోటిపల్లి సాయిబాబు, నక్కా త్రిలోచనరావు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, అడపా వెంకటరత్నం పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

ఆలమూరు: పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ జరిగింది. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మండల తెలుగు యువత ఆధ్వర్యంలో ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు గొడుగులు అందజేశారు. వైద్యాధికారులు పి.భవానీశంకర్, ఆర్.సుదర్శన్‌బాబు, సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, పి.ఉమ పాల్గొన్నారు.

ఆ తప్పుతో ఎంతో ముప్పు

- గడ్డిని కాల్చొద్దు.. భూసారం తగ్గిపోతుంది
- పొలాల్లోనే తగులబెడితే దిగుబడిపై ప్రభావం
- సూక్ష్మ పోషకాలు నశించే అవకాశం



పినపళ్లలో పొలంలోనే తగుల బెట్టిన ఎండుగడ్డి

ఆలమూరు: ఖరీఫ్, రబీ సీజన్‌లలో అనేక మంది రైతులు వరికోత యంత్రాలనే వినియోగిస్తున్నారు. దీనివల్ల పొలాల్లో గడ్డి నలిగిపోవడం వల్ల పశువులకు పనికిరాదన్న ఉద్దేశంతో రైతులు ఎండుగడ్డిని పొలాల్లోనే తగులబెడుతున్నారు. దీనివల్ల భూసారానికి తీవ్ర నష్టం కలుగుతుందని, దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని వ్యవసాయశాఖ చెబుతోంది. ఆ గడ్డిని పొలంలోనే ఉంచి దమ్ముల సమయంలో కలిపిదున్నడం ద్వారా భూమికి మేలు జరుగుతుందని అంటున్నారు. ఇటీవల కాలంలో స్ట్రా బేలర్ యంత్రాలతో నలిగిన గడ్డిని మోపులుగా సేకరించి పశుగ్రాసంగా వినియోగిస్తున్నారు. దీనివల్ల రైతులకు కొద్దిమేర ఆదాయం లభిస్తోంది. వరి కోత యంత్రాల ద్వారా లభ్యమైన గడ్డిని ఏదో విధంగా సద్వినియోగం చేసుకోవాలే తప్ప కాల్చడం సరి కాదనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది.

కలిపి దున్నితే ప్రయోజనం

కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో రబీ సీజన్‌లో సాగు చేసిన సుమారు 58 వేల ఎకరాల విస్తీర్ణంలో ఇప్పటికే వరి కోతలు పూర్తయ్యాయి. వరికోత యంత్రంతో కోత కోసినప్పుడు వచ్చే గడ్డి నలిగిపోతుంది. దీంతో పశువులు ఆ గడ్డిని తినేందుకు అంతగా ఇష్టపడవు. పశుగ్రాస అవసరాలకు ఉపయోగపడకపోవడంతో ఈ గడ్డిని పొలాల్లోనే తగులబెట్టడం పరిపాటిగా మారింది. అసలే భానుడి భగభగలు.. ఆపై మంటలు.. ప్రస్తుత వాతావరణాన్ని మరింత అగ్నిగుండం చేస్తున్నాయి. వేడిగాలులతో సమీపంలోని ప్రజలు, రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. మంటలు ఒక పొలం మీదుగా మరొక పొలానికి వ్యాపిస్తూ ధాన్యపు రాశులతో పాటు పొలాల్లో దిమ్మలపై ఉంచిన గడ్డివాములు నిప్పంటుకుని బూడిదయిన ఘటనలు గతంలో ఎన్నో ఉన్నాయి. గడ్డిని తగులబెట్టకుండా దమ్ములో కలిపి దున్నడం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని వ్యవసాయాధికారులు అంటున్నారు. గడ్డిని కాల్చకుండా దున్నడం ద్వారా కలిగే ప్రయోజనాలు, చేలకు లభించే భూసారం వివరాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ ఇప్పటికే వ్యవసాయశాఖ సదస్సులను ఏర్పాటు చేస్తోంది.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



పొలాల్లో గడ్డిని తగులబెట్టడం చాలా పెద్ద పొరబాటు. దీనివల్ల సూక్ష్మజీవులు చనిపోయి భూసారం తగ్గిపోతోంది. మురగడ దమ్ముతో మొక్కలకు అవసరమైన పోషకాలు లభిస్తాయి. ఈ విషయమై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్.లక్ష్మీ లావణ్య, మండల వ్యవసాయాధికారిణి ఆలమూరు

అధికారుల సూచనలు పాటిస్తున్నాం



వరికోత యంత్రాల ద్వారా లభించిన గడ్డిని గతంలో మాదిరిగా కాల్చకుండా వ్యవసాయశాఖ సూచనల మేరకు కలిపి దున్నేందుకు నిర్ణయించుకున్నాం. ఇటీవల స్ట్రాబేలర్ యంత్రాల ద్వారా కూడా నలిగిన గడ్డిని ఇతర ప్రాంతాలకు చెందిన కొంతమంది సేకరించి పశుగ్రాసంగా ఉపయోగిస్తున్నారు.

– ఇల్లూరి వెంకటరమణ, కౌలురైతు, పినపళ్ల

భూసారానికి అపార నష్టం

ఆరోగ్యవంతమైన భూమిలోని ఒక గ్రాము మట్టిలో టెన్ టూ ది పవర్ ఆఫ్ నైన్ (1000,000,000) సూక్ష్మజీవులు ఉంటాయి. భూమిలో కుళ్లిన పదార్థాన్ని ఇవి ఆహారంగా తీసుకుని మొక్కలకు అవసరమైన సూక్ష్మ పోషకాలను అందిస్తుంటాయి. పొలాల్లోని గడ్డిని కాల్చివేయడం వల్ల ఈ సూక్ష్మజీవులు చనిపోయి భూసారానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఇలాంటి పరిస్థితుల వల్లనే గతంలో రైతులు ఎప్పుడూ వినియోగించని జింకు, బోరాన్ తదితర చిన్నచిన్న సూక్ష్మ పోషకాలను పొలాల్లో నేరుగా వేయాల్సి వస్తోంది. గడ్డిని తగులబెట్టకుండా పొలంలోనే కుళ్లించి, నేలలో కలిపి మురగడ దమ్ము చేస్తే చక్కని ఫలితం ఉంటుంది. ఈ విధంగా చేసేటప్పుడు దమ్ముకు దమ్ముకు మధ్య వారం రోజులు వ్యత్యాసం ఉండాలి. దీనివల్ల ఈ గడ్డి బాగా కుళ్లి భూమిలో కలిసిపోయి మొక్కలకు అవసరమైన సూక్ష్మపోషకాలు సంవృద్ధిగా అందుతాయి. .

రైతు సంక్షేమమే లక్ష్యం

అంబాజీపేట: రైతన్నల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఇరుసుమండలో సొసైటీ అధ్యక్షుడు నాగాబత్తుల సత్యానందం అధ్యక్షతన నూతన సొసైటీ భవన నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ సొసైటీల అభివృద్ధికి రైతుల సహకారం ఎంతో అవసరమన్నారు. సొసైటీల ద్వారా రైతులకు, కౌలు రైతులకు రుణాలు అందించి వారి ఆర్థిక పురోభివృద్ధికి దోహదపడుతున్నామన్నారు. రైతన్నల శ్రేయస్సుకు రైతు భరోసా, రుణాలు, సబ్సిడీ పై యంత్రాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, సర్పంచ్ అక్కిశెట్టి నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు బూడితి సత్యానారాయణమ్మ పాల్గొన్నారు.

నేడు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

మామిడికుదురు: బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన భారత మాజీ ఉప ప్రధాని, డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందని కమిటీ శుక్రవారం తెలిపింది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సమీక్షా సమావేశం జరుగుతుందన్నారు.

జాబ్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

అంబాజీపేట: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులు చేయదలిచేవారు తప్పనిసరిగా జాబ్‌కార్డు పొంది ఉండాలని, తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. వక్కలంకలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సర్పంచ్ శుక్రవారం పరిశీలించారు. గుర్తింపు కార్డులను ఉపాధి కూలీలకు అందించారు.

తెలుగుపై పట్టు సాధించాలి

అంబాజీపేట: ప్రతీ విద్యార్థి చిన్నతనం నుంచి తెలుగు భాషపై పట్టు సాధించాలని జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో తెలుగు భాష విశిష్టతను విద్యార్థులకు శుక్రవారం వివరించారు. తెలుగు భాషలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

సమస్యలపై ప్రజా పోరాటం

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతర పోరాటం చేస్తుందని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. స్థానిక సమతా స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో శుక్రవారం మండల సీపీఐ సమావేశం జరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కరపత్రాలపై ముద్రించి ప్రజలకు తెలియజేయడంతో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సమావేశం తీర్మానించింది. సమస్యలు పరిష్కారం కాని పక్షంలో జూన్ రెండో వారం నుంచి ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని కార్యదర్శి రామకృష్ణ హెచ్చరించారు. సీపీఐ నాయకులు జె.యేసురాజు, వి.శ్యామ్, జి.వెంకట్రావు, ఈశ్వరి, వరలక్ష్మి పాల్గొన్నారు.

పాలవెల్లువపై అవగాహన

ఆలమూరు: పాలవెల్లువ కార్యక్రమంపై గ్రామాల్లో విరివిగా పాడిరైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, తహసీల్దార్ బీపీ శెట్టి తెలిపారు. మండలంలోని వివిధ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం పాలవెల్లువ కార్యక్రమంపై యానిమేటర్లు, పశుసంవర్థకశాఖ అధికారులతో అవగాహన సదస్సులు జరిగాయి. తొలుత ఆయా శాఖల సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పాడి రైతులను గుర్తించాలన్నారు. వారి ద్వారా పాలను సేకరించి ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న పాల కేంద్రాలకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీఎం ఎం.విశ్వనాథ్, ఏపీఓ కామత్, ఏఓ ఎస్.లక్ష్మీ లావణ్య పాల్గొన్నారు.

ఆత్రేయపురం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ నాతి బుజ్జి ఆధ్వర్యంలో పాలవెల్లువపై అవగాహన సదస్సు జరిగింది. వెలుగు, ఎన్ఆర్‌జీఈఎస్, వ్యవసాయశాఖ, పశుసంవర్థకశాఖ అధికారులు పాల్గొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఆయా శాఖల సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పాడిరైతులను గుర్తించాలన్నారు. అమూల్ సంస్థకు పాలు విక్రయించడం వల్ల కలిగే లాభాలను వివరించాలన్నారు. తద్వారా వారి వద్ద నుంచి పాలవెల్లువ పాల కేంద్రాలకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళ శక్తి సంఘాలతో సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంకలో శుక్రవారం జరిగిన పాలవెల్లువ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రైతులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలవెల్లువ కార్యక్రమంపై ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అవగాహన కల్పించారు. రైతులకు పాలవెల్లువపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం పాడి రైతులకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు.

ఈ- సంజీవనిపై ప్రత్యేక దృష్టి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ - సంజీవనిపై వైద్యారోగ్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ నివాస్ కోరారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వైద్యారోగ్య సిబ్బందికి వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. గర్భం దాల్చిన వెంటనే వివరాలు నమోదు చేసుకుని ఐడీని క్రియేట్ చేయాలన్నారు. హైరిస్క్ ప్రసవాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధిగా వైద్యారోగ్య సిబ్బంది ఎఫ్ఆర్ఎస్‌ను నమోదు చేసుకోవాలని కోరారు. వైద్యాధికారులు పి.భవానీశంకర్, ఆర్.సుదర్శన్‌బాబు, డి.సువర్చలానాయుడు పాల్గొన్నారు.

వలంటీర్లు 'జగనన్న లక్ష్య' సారథులు

ఎంపీపీ గంగాధరరావు



గంటిలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ గంగాధరరావు, సర్పంచ్‌లు, నాయకులు

కొత్తపేట: గ్రామ వలంటీర్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ లక్ష్య సారథులని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని పలివెల, గంటి గ్రామాల్లో వలంటీర్లకు అవార్డుల ప్రదానం చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ కార్యదర్శి పి.సత్తిబాబు అధ్యక్షతన, గంటి పీఏసీఎస్ వద్ద కల్యాణ మంటపంలో ఆ గ్రామ సర్పంచ్ సాగి బంగార్రాజు అధ్యక్షతన జరిగిన సభల్లో ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయా సభల్లో ఆయన మాట్లాడుతూ తమ పరిధిలోని 50 కుటుంబాల్లో ఎవరికి ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. పలివెల సచివాలయం - 1 పరిధిలో వలంటీర్ చప్పిడి మౌనికను సేవా రత్న అవార్డుతో, ఇతర వలంటీర్లను సేవామిత్ర పురస్కారాలతో సత్కరించారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యులు గునిపే శ్యామల, ముళ్ల జనార్దనరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మట్టపర్తి వెంకట్రావు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పునాదులు

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- గంగలకుర్రులో గడపగడపకూ మన ప్రభుత్వం



గంగలకుర్రులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పథకాలతో రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పునాదులు వేసిందని, దీని కోసం సగర్వంగా చెప్పేందుకు మీ ముందుకు వచ్చానని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రులో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏ ఇంట్లో ఏ పథకాల ద్వారా ఎంతమేర లబ్ధి చేకూరిందో వివరించారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా బలపర్చాలన్నారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామంలో రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని త్వరలో నిర్మాణాలు చేపడతామన్నారు. ప్రతీ ఇంటికి రూ.40 వేల నుంచి గరిష్ఠంగా రూ.2.6 లక్షల వరకు వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు నెల్లి పండు, సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రశేఖర్, దొమ్మేటి సత్యమోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లది కీలక పాత్ర



నేతలు, అధికారుల సత్కారం పొందిన గ్రామ వలంటీర్లు

ఆలమూరు: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో గ్రామ వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని వైఎస్సార్ సీపీ నేతలు అన్నారు. మండలంలోని చెముడులంకలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా సేవావజ్రకు ఎంపికైన ముగ్గురిలో ఇద్దరు ఆలమూరు మండలానికి చెందిన బుడ్డిగ అన్నపూర్ణ (చెముడులంక-1), పసుపులేటి సురేష్ (చెముడులంక-2) ఉన్నారు. వీరికి రూ.30 వేలు చొప్పున ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందించింది. వీరిద్దరితో పాటు మిగతా గ్రామ వలంటీర్లకు పూలమాలలు వేసి దుశ్శాలువా కప్పి, ప్రశంసాపత్రాలను అందజేసి సత్కరించారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ నెక్కంటి వెంకట్రాయుడు, పంచాయతీ కార్యదర్శి యు.రేణుక, దొండపాటి వీర వెంకట్రావు, యు.సుందరం విజయం, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

'గడప గడపకు'తో సమస్యల పరిష్కారం



అప్పనపల్లి ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభం

మామిడికుదురు: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంతో సమస్యలు సత్వరం పరిష్కారం అవుతున్నాయి. ఈ నెల 20వ తేదీన అప్పనపల్లిలో ఈ కార్యక్రమం జరిగింది. మందపాటివారిపేటలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని స్థానికులు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు దృష్టికి తీసుకు వచ్చారు. ఎస్టీ కాలనీలో పదేళ్ల క్రితం విద్యుత్ స్తంభం తీసుకు వచ్చారు. కానీ దాన్ని నిలబెట్టలేదు. దీంతోపాటు ఆ కాలనీకి మరో కరెంటు స్తంభం అవసరమవుతుందని సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి ఎమ్మెల్యే చిట్టిబాబుకు వివరించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖాధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎస్టీ కాలనీలో రెండు విద్యుత్ స్తంభాలను క్రేన్ సహాయంతో శుక్రవారం నిలబెట్టారు. మందపాటివారిపేటలో కరెంటు స్తంభం నిలబెట్టి సమస్యను పరిష్కరించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వలంటీర్‌తోనే 100 శాతం ప్రభుత్వ పథకాల అమలు



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: ఎక్కడా అవినీతికి తావు ఇవ్వకుండా వలంటీర్లు 100 శాతం ప్రభుత్వ పథకాలను అర్హులైన పేద ప్రజలకు అందిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శుక్రవారం అయినవిల్లి-1, 2 సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సత్కరించారు. ఈ సమావేశం స్థానిక పంచాయతీ కార్యదర్శి కె.రామచంద్రరావు అధ్యక్షతన జరిగింది. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అచ్చెన్న వ్యాఖ్యలకు ఖండన



మీడియాతో మాట్లాడుతున్న నాయకులు

రావులపాలెం: వైఎస్సార్ సీపీ గాలికి వచ్చిన పార్టీ అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విమర్శించడాన్ని కొత్తపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు ఖండించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాయలంలో మీడియా సమావేశంలో జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ సాకా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ మా పార్టీ గాలికి వచ్చిందో లేక 30 ఏళ్లకు పైగా రాజకీయంలో ఉన్న టీడీపీని గాలిలో కలిపిందో ప్రజలకు తెలుసని అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ అచ్చెన్నాయుడు సామాజిక న్యాయం పాటించట్లేదు అని అబద్ధపు పేలాపనలు పేలుతున్నారన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలకు అన్ని నామినేటెడ్ పదవులలో 50 శాతం అవకాశం కల్పించారని చెప్పారు. ఆత్రేయపురం మండల కన్వీనర్ కనుమూరి శ్రీనురాజు మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో పేద ప్రజల ఇళ్లలో ఆనందాన్ని నింపిన నాయకుడు జగన్ అన్నారు.

కొత్తపేట మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసే నాయకులను కుల, మతాలకు అతీతంగా ఆదరిస్తారని కుట్రలు, కుతంత్రాలు నరనరాల్లో నింపుకున్న టీడీపీ నాయకులు ఇది గుర్తెరగాలని చెప్పారు. ఎంపీపీ తోరాటి లచ్చన్న, జెడ్పీటీసీ సభ్యులు బోనం సాయిబాబు, తోరాటి రాంబాబు, సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాస్, పెంటపాటి వెంకన్న పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగు వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యాలయంలో వేడుకలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

అయినవిల్లి: వివిధ శాఖలకు చెందిన అధికారులు అధికారిక సమావేశాలకు విధిగా హాజరుకావాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సభకు హాజరు కానీ ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, డ్రెయిన్స్ శాఖలకు చెందిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ దృష్టికి కొందరూ ప్రజా ప్రతినిధులు తీసుకోచ్చారు. దీనిపై చర్యలకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆదేశించారు. వీరవల్లిపాలెం సర్పంచ్ సలాది బుచ్చిరాజు మాట్లాడుతూ తమ గ్రామానికి జలజీవన్‌మిషన్ కింద మొట్టమొదట ప్రాజెక్టు మంజూరు అయినా ఇప్పటి వరకూ పనులు ప్రారంభం కాలేదన్నారు. ఈ పనులు తాత్సారం చేయడం వల్ల గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని సమావేశం దృష్టికి వచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్ తరగతుల ప్రారంభం



స్పోకెన్ ఇంగ్లిష్ తరగతుల ప్రారంభంలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం నాయకులు

అమలాపురం రూరల్: ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ, పేరూరు అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేరూరు తాడిగుంట మెరక కమ్యూనిటీ హాల్‌లో స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. వీటిని సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల నకులరాజు, గోసంగి బంగార్రాజు, స్థానిక అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఆంగ్లంపై భయాన్ని తొలగించే దిశగా ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం కృషి చేస్తుందని అన్నారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి గెడ్డం ప్రదీప్, మాజీ ఎంపీటీసీ ముత్తాబత్తుల వీరవెంకట సత్యనారాయణ, జల్లి శేఖర్, ముత్తాబత్తుల ఆనందరావు, నాగాబత్తుల భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ

అమలాపురం టౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా మెయిన్ రోడ్డు చెంతన ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఇద్దరు మద్యం మత్తులో గురువారం రాత్రి ఘర్షణకు దిగారు. ఈ గలాటాలో ఇద్దరికీ గాయాలయ్యాయి. గాయపడిన వీరిని వారి సంబంధీకులు ఆస్పత్రులకు తరలించి వైద్యం అందించారు. కాకినాడ, రాజమహేంద్రవరంలోని చెరో కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి వారు వైద్యం పొందినట్లు తెలిసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన ఇద్దరి నుంచి పోలీసులకు శుక్రవారం కూడా ఎలాంటి ఫిర్యాదు అందలేదు.